సాక్షి
అనంతపురం
ఆదివారం । 8 । డిసెంబర్ । 2024



చీనీ టన్ను రూ.40,100

అనంతపురం మార్కెట్‌యార్డులో శనివారం చీనీకాయలు టన్ను గరిష్ట ధర రూ.40,100 పలికాయి.



టమాట కిలో రూ.35

కక్కలపల్లి మండీలో శనివారం కిలో టమాట గరిష్ట ధర రూ.35 పలికింది. కనిష్టం రూ.20, సరాసరి ధర రూ.30 ప్రకారం క్రయ విక్రయాలు జరిగాయి.

గరిష్ఠం/కనిష్ఠం
34.6°/19.4°

జిల్లా అంతటా శనివారం ఉష్ణోగ్రతలు స్థిరంగా నమోదయ్యాయి. ఆకాశం పాక్షికంగా మేఘావృతమై అక్కడక్కడా తుంపర్లు పడ్డాయి. ఆగ్నేయం దిశగా గంటకు 6 నుంచి 8 కిలోమీటర్ల వేగంతో గాలులు వీచాయి.

న్యూస్‌రీల్

సైనికుల సంక్షేమానికి విరాళాలు ఇవ్వండి



ర్యాలీలో పాల్గొన్న మాజీ సైనికులు

అనంతపురం: దేశ రక్షణలో ప్రాణ త్యాగం చేసిన సైనికుల కుటుంబాలకు, దేశ రక్షణ కోసం సరిహద్దుల్లో అహర్నిశలు విధులను నిర్వర్తిస్తున్న సైనికులకు, మాజీ సైనికుల సంక్షేమానికి ఉదారంగా విరాళాలు ఇవ్వాలని అనంతపురం కలెక్టర్ వినోద్‌కుమార్, శ్రీసత్యసాయి జిల్లా కలెక్టర్ టీఎస్ చేతన్ ,అనంతపురం జాయింట్ కలెక్టర్ శివ్ నారాయణ శర్మ ఇరు జిల్లాల ప్రజలకు విజ్ఞప్తి చేశారు. ఉమ్మడి జిల్లా సైనిక సంక్షేమశాఖ ఆధ్వర్యంలో సాయుధ దళాల పతాక దినోత్సవాన్ని శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సైనిక సంక్షేమ శాఖ రూపొందించిన స్టిక్కర్లు, కార్ ఫ్లాగ్స్, కరపత్రాలను అన్ని వర్గాల ప్రజలకు, అధికారులకు, ఉద్యోగులకు, దాతలకు అందజేశారు. వీర జవాన్ల కుటుంబాలకు అండగా ఉండాలన్నారు. శనివారం ఉదయం అనంతపురం ఆర్ట్స్ కళాశాల నుంచి క్లాక్ టవర్ వరకు సైనిక సంక్షేమశాఖ ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించారు. జిల్లా సైనిక సంక్షేమ శాఖాధికారి పి. తిమ్మప్ప, మాజీ సైనికుల సంఘం నాయకులు కెప్టెన్ షేకన్న, విశ్వేశ్వరరావు, ఆర్ట్స్ కళాశాల ప్రిన్సిపాల్ పద్మశ్రీ, కళాశాల ఎన్‌సీసీ అధికారులు రామాంజినేయులు, వెంకమ్మ తదితరులు పాల్గొన్నారు.

హత్యాయత్నం కేసులో టీడీపీ మద్దతుదారుల అరెస్టు



నిందితుల అరెస్టును చూపుతున్న పోలీసులు

తాడిపత్రి రూరల్: పట్టణ సమీపంలోని పెన్నానదిలో వైఎస్సార్‌సీపీ మద్దతుదారులైన శ్రీనివాసులు, హాజీబాషా, అజయ్‌లపై టీడీపీ వర్గీయులు జరిపిన హత్యాయత్నం కేసులో శనివారం ఆరుగురు నిందితులను అరెస్టు చేశామని అప్‌గ్రేడ్ సీఐ శివగంగాధర్ రెడ్డి తెలిపారు. అప్‌గ్రేడ్ పోలీస్ స్టేషన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. టీడీపీకి చెందిన మల్లెల వేణుగోపాల్, వైఎస్సార్‌సీపీకి చెందిన రామాంజినేయులు గతంలో ఒకే వర్గంలో ఉండేవారన్నారు. ఆధిపత్య పోరు కారణంగా తాడిపత్రి పట్టణంలోని పోరాట కాలనీలో రెండుగా విడిపోయారన్నారు. ఈనెల 3న వేణుగోపాల్ వర్గానికి చెందిన మహ్మద్ హుస్సేన్‌కి కుమారుడు పుట్టడంతో వర్గీయులందరికి పెన్నానదిలోని వరాలు తోట వద్ద ఉన్న పంపుహౌస్‌లో డిన్నర్ ఏర్పాటు చేశాడని తెలిపారు. రామాంజినేయులు వర్గానికి చెందిన కొందరు డిన్నర్ జరుగుతున్న ప్రదేశానికి కొద్ది దూరంలో తిరుగుతున్నారంటూ డిన్నర్‌లో పాల్గొన్న వారు వేణుగోపాల్‌కు సమాచారం అందించారని చెప్పారు. వారి సమాచారంతో వేణుగోపాల్‌తో పాటు మరి కొందరు పీడిబాకు, కట్టెలతో వచ్చి మోటార్ సైకిల్‌పై ఎదురుగా వస్తున్నా రామాంజినేయులు వర్గానికి చెందిన వారిపై దాడి చేశారని పేర్కొన్నారు. దాడిలో పాల్గొన్న టీడీపీ వర్గీయులైన వేణుగోపాల్, చాకలి సురేష్, షేక్ హుస్సేన్, గోపి కృష్ణ, షేక్ మహమ్మద్ హుస్సేన్, రామాంజినేయులను అరెస్టు చేసి కోర్టుకు హాజరు పరిచామని ఆయన తెలిపారు.

క్షణికావేశం.. తీరని శోకం

- నార్పల మండల కేంద్రంలోని సంత బజారులో నివాసం ఉండే కృష్ణ కిషోర్ (45), భార్య శిరీష (35) ఇటీవల తమ ఐదు నెలల చిన్నారితో కలిసి ఆత్మహత్యకు పాల్పడటం కలచివేసింది. ఆర్థిక సమస్యల వల్లే ఈ అఘాయిత్యానికి పాల్పడ్డారు. ధైర్యం తెచ్చుకుని అప్పులు తీర్చే మార్గం ఎంపిక చేసుకుని ఉంటే మూడు జీవితాలు నిలబడేవి.
- గార్లదిన్నె మండలం మర్తాడుకు చెందిన తాతిరెడ్డి కుమారుడు యోగేంద్రనాథ్‌రెడ్డి (26) బీటెక్ పూర్తి చేశాడు. ఆరు నెలల క్రితం బెంగళూరుకు వెళ్లి ఉద్యోగం కోసం ప్రయత్నించాడు. ఎక్కడా ఉద్యోగం లభించకపోవడంతో మనస్తాపానికి గురై అనంతపురం వచ్చేశాడు. రూరల్ మండలం సోములదొడ్డి శివారులో ఇంటికి వెళ్లకుండా నేరుగా రైల్వే గేటు వైపు వెళ్లాడు. అక్కడ ఓ కానుగ చెట్టుకు ఉరి వేసుకున్నాడు. క్షణికావేశంలో తీసుకున్న నిర్ణయంతో తల్లిదండ్రులకు తీరని వేదన మిగిల్చాడు. రోజూ ఇలాంటి ఘటనలు జిల్లాలో ఎక్కడో ఒకచోట చోటుచేసుకుంటూనే ఉన్నాయి.



- పెరిగిపోతున్న ఆత్మహత్యలు
- కుటుంబ కలహాలతో మనస్తాపం
- ఆర్థిక ఇబ్బందులతో సతమతం
- ప్రేమ విఫలమై జీవితంపై విరక్తి
- సమస్య ఏదైనా చావు పరిష్కారం కాదు
- ఆలోచిస్తే పరిష్కారం లభిస్తుందంటున్న నిపుణులు

అనంతపురం: చిన్నచిన్న విషయాలకే మనస్పర్థలు రావడం.. గొడవ పడటం.. ఉద్వేగానికి లోనవడం.. వెరసి క్షణికావేశంలో ఆత్మహత్య చేసుకుంటున్నారు. అనారోగ్యం, ఆర్థిక ఇబ్బందులు, కుటుంబ కలహాలు, ప్రేమ విఫలం, మత్తుకు బానిస ఇలా కారణం ఏదైనా చిన్న వారి నుంచి పెద్ద వారి వరకు అర్థంతరంగా తనువు చాలిస్తున్నారు. తమను నమ్ముకున్న వారికి, తల్లిదండ్రులకు పుట్టెడు దుఃఖం మిగుల్చుతున్నారు. ఈ ఏడాదిలో గడిచిన 11 నెలల కాలంలో జిల్లా వ్యాప్తంగా 282 మంది బలవన్మరణాలకు పాల్పడ్డారు. 316 మంది ఆత్మహత్యాయత్నం చేసి ప్రాణాలతో బయటపడ్డారు. ఒక్క అక్టోబర్ నెలలోనే జిల్లాలో 47 మంది ఆత్మహత్య చేసుకోవడం విస్మయం కల్గించే అంశం.

పరిష్కారం మరచి...


ప్రస్తుతం చోటుచేసుకుంటున్న ఆత్మహత్యలు క్షణికావేశంలో జరుగుతున్నవే ఎక్కువ. సమస్యలకు పరిష్కార మార్గాలు ఉన్నా విస్మరించి ప్రాణాలు తీసుకుంటున్నారు. ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్న వారు వాటిని తీర్చే మార్గాలు, వనరులు కళ్ల ముందు కనిపిస్తున్నా.. మానసిక బలహీనతల కారణంగా ఆత్మహత్యల వైపు వెళుతుండడం ఆందోళన కల్గించే అంశం. కుటుంబంలో కలహాలు వచ్చినప్పుడు సర్దుకుపోకుండా పంతానికి పోయి సమస్యను పెద్దది చేసుకుంటున్నారు.

'హితులు' కరువు

మానసిక ఆందోళన, ఒత్తిడికి గురైన వారికి కుటుంబ సభ్యులు, మిత్రుల ఓదార్పు ఎంతైనా అవసరం. బాధితులతో మనసు విప్పి మాట్లాడితే ఒత్తిడి నుంచి బయటపడతారు. ప్రస్తుతం అలాంటి ఓదార్పు కరువైంది. స్నేహితులు సరదాగా ఇంటి బయట, కళాశాలల్లో కబుర్లు చెప్పుకోవడమే తప్ప..బాధలను పంచుకోవడం లేదు. కుటుంబాల్లో కూడా అదే పరిస్థితి ఉంది. బాధలు కలిగినప్పుడు ఎవరితోనూ పంచుకోలేక, ఒత్తిడి తట్టుకోలేక జీవితాలు త్యజిస్తున్న మధ్య వయస్కులు ఎంతో మంది ఉన్నారు. యువతీ యువకులు ఒత్తిడి ఎదుర్కొంటున్న సమయంలో పెద్దలు ఆప్యాయంగా మాట్లాడి సమస్య తెలుసుకోవాలి. పరిష్కారానికి ప్రయత్నించాలి.

గడిచిన 11 నెలల్లో జిల్లాలో ఆత్మహత్య చేసుకున్న వారి సంఖ్య	282
ఆత్మహత్యాయత్నం చేసిన వారి సంఖ్య	316

ప్రాథమిక దశలోనే గుర్తించాలి



చిన్న విషయాలకే కుంగుబాటుకు లోనవుతున్నారు. విద్యార్థులు కూడా విలాసవంత జీవితానికి ఇష్టపడుతున్నారు. లివింగ్ రిలేషన్‌షిప్ అనే ట్రెండ్ నడుస్తోంది. మద్యం, మాదక ద్రవ్యాలకు బానిసవుతున్నారు. బెట్టింగ్, లోన్ యాప్, ఆన్‌లైన్ గేమ్స్‌కు అలవాటుపడుతున్నారు. చిన్న కుటుంబాలు కావడంతో ఫ్యామిలీ వ్యవస్థపై పర్యవేక్షణ లేకుండా పోయింది. సమస్యల చట్రంలో ఇరుక్కుపోయి విపరీతంగా ప్రవరిస్తుంటే అటువంటి వారికి ఓదార్పు అవసరం. చదువు మార్కుల కోసమే కాకుండా విజ్ఞానం కోసమే అనే అంశంపై తల్లిదండ్రులు అవగాహన కల్పించాలి. ప్రాణాలు తీసుకోవడం సమస్యలకు పరిష్కారం కాదు. మాట సాయం బతుకు మీద ఆశ కల్పిస్తుంది. మనోస్థైర్యం కల్పించే ఆప్తులు ఉన్నారనే భరోసా కల్పించాలి.

– డాక్టర్ ఎండ్లూరి ప్రభాకర్, సైకియాట్రిస్టు, అనంతపురం

సానుకూల ధోరణి అలవరచుకోవాలి



సానుకూల ధోరణి అలవరచుకోవాలి. ఆత్మహత్య పరిష్కారం కాదు. ఏదైనా సమస్య ఉంటే కుటుంబ సభ్యులతో చర్చించాలి. ఉన్నత స్థానాలు అధిరోహించిన మహోన్నత వ్యక్తుల జీవితాలను అధ్యయనం చేయాలి. వారి నుంచి స్ఫూర్తి పొంది సమస్యలను అధిగమించాలి.

– పి. జగదీష్, ఎస్పీ, అనంతపురం.

భర్త సాఫ్ట్‌వేర్ ఇంజినీర్.. భార్య దొంగ

- 38 తులాల బంగారం చోరీ కేసులో బ్యూటీషియన్ అరెస్టు



స్వాధీనం చేసుకున్న బంగారు నగలను చూపుతున్న పోలీసులు

పామిడి: ఆమె భర్త సాఫ్ట్‌వేర్ ఇంజినీర్.. ఆమె బ్యూటీషియన్. అయితే ఏం బుద్ధి పుట్టిందోగాని పనిచేసేకి వచ్చిన చోటనే దొంగతనానికి పాల్పడింది. 38 తులాల బంగారం కొట్టేసి జారుకుందామనుకుని పోలీసుల విచారణలో దొరికిపోయింది. శనివారం పామిడి పోలీస్‌స్టేషన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో సీఐ యుగంధర్ వివరాలను వెల్లడించారు. రామరాజుపల్లికి చెందిన విశ్వనాథ్‌రెడ్డి కుమార్తె పెళ్లి శుక్రవారం పామిడిలోని కోగటం ఫంక్షన్ హాల్‌లో జరిగింది. పెళ్లి కుమార్తెను అలంకరించేందుకు గుంతకల్లు పట్టణానికి చెందిన సాఫ్ట్‌వేర్ ఇంజినీర్ భార్య అయిన బ్యూటీషియన్ వై.అనూషను పిలిపించారు. అయితే పెళ్లి కుమార్తెకు చెందిన దాదాపు 38 తులాల రెండు బంగారు వడ్డాణాలు చోరీకి గురయ్యాయి. అయితే పెళ్లికి వచ్చిన వారిని ఆరా తీస్తే ఎలా ఫీలవుతారోనని సంకోచించిన విశ్వనాథ్‌రెడ్డి చివరకు పోలీసులకు ఫిర్యాదు చేశాడు. దీంతో పోలీసులు ఫంక్షన్‌హాల్‌కు చేరుకుని పరిశీలించారు. అక్కడి వారిని విచారణ చేశారు. శనివారం స్థానిక బైపాస్ స్పీడ్ బ్రేకర్ల వద్ద అనుమానాస్పదంగా సంచరిస్తున్న బ్యూటీషియన్ వై.అనూషను పోలీసులు అదుపులోకి తీసుకొని తమదైన శైలిలో విచారించగా బంగారం చోరీ చేసినట్లు ఒప్పుకొంది. పెళ్లి కుమార్తెను మేకప్ చేసిన గదిలోని వాష్‌రూమ్ ఫ్లష్ ట్యాంకులో దాచినట్లు వెల్లడించింది. ఈ మేరకు బంగారు వడాణాలు స్వాధీనం చేసుకొని, బ్యూటీషియన్‌పై కేసు నమోదు చేశామని సీఐ తెలిపారు.

రైతు సమస్యలపై 13న ర్యాలీ

- ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయాలి
- మద్దతు ధరతో కొనుగోలు చేసి రైతులను ఆదుకోవాలి
- వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు అనంత వెంకటరామిరెడ్డి



మాట్లాడుతున్న అనంత వెంకటరామిరెడ్డి, చిత్రంలో తలారి రంగయ్య

అనంతపురం కార్పొరేషన్: రైతు సమస్యలపై ఈ నెల 13న కలెక్టరేట్‌కు ర్యాలీ నిర్వహించనున్నట్లు జిల్లా అధ్యక్షుడు అనంత వెంకటరామిరెడ్డి తెలిపారు. శనివారం వైఎస్సార్‌సీపీ జిల్లా కార్యాలయంలో మాజీ ఎంపీ, కళ్యాణదుర్గం నియోజకవర్గ సమన్వయకర్త తలారి రంగయ్యతో కలసి ఆయన విలేకరుల సమావేశం ఏర్పాటు చేశారు. కూటమి ప్రభుత్వంలో రైతుల పరిస్థితి అగమ్యగోచరంగా మారిందని, ప్రభుత్వానికి కనువిప్పు కలిగించేందుకు వైఎస్సార్‌సీపీ అధినేత, మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి కార్యాచరణ సిద్ధం చేశారని తెలిపారు. అందులో భాగంగానే ర్యాలీ చేపడుతున్నట్లు చెప్పారు. 13న ఉదయం పది గంటలకు జిల్లాపరిషత్ కార్యాలయం ముందున్న వైఎస్సార్ విగ్రహం నుంచి కలెక్టరేట్‌కు ర్యాలీగా వెళ్లి వినతిపత్రం అందజేస్తామన్నారు. పార్టీ సమన్వయకర్తలు, నాయకులు, కార్యకర్తలు రైతులను భాగస్వామ్యం చేసుకుని ర్యాలీని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. జిల్లాలో కరువు మండలాల ఎంపిక, పంటల నష్టం అంచనా వేయడంలో అధికారులు విఫలమయ్యారన్నారు. ఈ ఏడాది ఖరీఫ్‌లో అతివృష్టి, అనావృష్టి కారణంగా రైతులు పెద్ద ఎత్తున నష్టపోయారన్నారు. ధాన్యం కొనుగోలు కేంద్రాల ఏర్పాటుకాకపోవడంతో వ్యాపారులు, దళారులు కుమ్మకై తక్కువ ధరకే కొనుగోళ్లు చేస్తున్నారన్నారు. వరి, మొక్కజొన్న, వేరుశనగ, పత్తి ఇతరత్ర పంటలకు మద్దతు ధర ప్రకటించినా అందుకు అనుగుణంగా క్షేత్రస్థాయిలో అమ్ముకునే పరిస్థితి లేదన్నారు. గత ఏడాది వరి ధాన్యం క్వింటాలు ధర రూ.2700 నుంచి రూ.2800 ఉంటే ఇప్పుడు రూ.1700 వరకు మాత్రమే పలుకుతోందన్నారు. తక్షణమే కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసి, మద్దతు ధరతో పంట దిగుబడులు కొనాలని డిమాండ్ చేశారు. ఫీజు రీయింబర్స్‌మెంట్, అమ్మఒడి, ఆర్టీసీ బస్సుల్లో మహిళలకు ఉచిత ప్రయాణం, నిరుద్యోగ భృతి, తదితర పథకాలను అమలు చేయడంలో సీఎం చంద్రబాబు విఫలమయ్యారన్నారు. అధికారంలో ఉన్నా, ప్రతిపక్షంలో ఉన్నా వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ప్రజల పక్షాన నిలుస్తుందని చెప్పారు.

అన్ని పక్షాలూ ముందుకురావాలి

రైతు సమస్యలపై ఈ నెల 13న నిర్వహించే ర్యాలీలో అన్ని రాజకీయ పక్షాలూ, మేధావులు, రైతు సంఘాల నాయకులు కలిసి ముందుకు రావాలని మాజీ ఎంపీ, వైఎస్సార్‌సీపీ కళ్యాణదుర్గం నియోజకవర్గ సమన్వయకర్త తలారి రంగయ్య పిలుపునిచ్చారు. పంటలకు గిట్టుబాటు ధరలు కల్పించి, కొనుగోలు చేయడంలో కూటమి సర్కారు తాత్సారం చేస్తోందన్నారు. జిల్లాలో కిసాన్ రైలును పునరుద్ధరించాలని డిమాండ్ చేశారు. వైఎస్సార్‌సీపీ హయాంలో కిసాన్ రైలులో 50 శాతం సబ్సిడీపై రవాణా చేస్తే, ఇప్పుడా పరిస్థితి లేకుండా పోయిందని తెలిపారు. జిల్లాలో విరివిగా పండ్ల తోటలు సాగవుతున్నాయని, పంట ఉత్పత్తులకు మార్కెట్ సౌకర్యం కల్పించాలని డిమాండ్ చేశారు. కిసాన్ ఉడాన్ కింద విమానాల ద్వారా సరుకు తరలించేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలన్నారు. సాగునీటి రంగానికి అధిక ప్రాధాన్యత ఇవ్వాలన్నారు. హెచ్చెల్సీ ఆధునికీకరణ చేపట్టాలన్నారు.

నలుగురికి మూడేళ్ల జైలు శిక్ష

- అదనపు కట్నం వేధింపుల కేసులో జడ్జి శోభారాణి తీర్పు

అనంతపురం: అదనపు కట్నం వేధింపుల కేసులో నలుగురికి మూడేళ్ల జైలు శిక్ష, రూ.5 వేల జరిమానా విధిస్తూ అనంతపురం మహిళా కోర్టు జడ్జి శోభారాణి తీర్పు చెప్పారు. వివరాల్లోకి వెళితే... ముదిగుబ్బ మండలం రామిరెడ్డిపల్లి గ్రామానికి చెందిన చెన్నకేశవరెడ్డి తన కుమార్తె స్రవంతిని కొత్తచెరువులోని దర్గా వీధికి చెందిన ఓం ప్రకాశ్‌రెడ్డికిచ్చి 2015లో వివాహం జరిపించారు. ఆ సమయంలో 10 తులాల బంగారం ఇచ్చారు. పెళ్లయిన కొన్నిరోజులకే అదనపు కట్నం కోసం ఓంప్రకాశ్‌రెడ్డి భార్య స్రవంతిని వేధింపులకు గురిచేశాడు. ఇందుకు అతని కుటుంబీకులు ఆదిలక్ష్మి, శివారెడ్డి, ప్రశాంతి మద్దతు పలికారు. రోజురోజుకూ వారి వేధింపులు ఎక్కువ కావడంతో స్రవంతి విషయాన్ని తండ్రికి తెలియజేసింది. దీంతో ఓంప్రకాష్‌రెడ్డి కుటుంబీకులంతా కలిసి ఆమెను శారీరకంగా, మానసికంగా వేధించారు. అంతేకాకుండా చీరను గొంతుకు బిగించి చంపేందుకు ప్రయత్నించారు. దీంతో భయపడిపోయిన స్రవంతి 2017 ఏప్రిల్ 21న కొత్తచెరువు పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. అప్పటి ఎస్ఐ రాజశేఖర్‌రెడ్డి కేసు నమోదు చేసి దర్యాప్తు చేశారు. అనంతపురంలోని సెషన్-4 కోర్టులో చార్జ్‌షీట్ దాఖలు చేశారు. అనంతరం కోర్టులో సాక్షులను ప్రవేశపెట్టారు. నేరం రుజువుకావడంతో జడ్జి శోభారాణి శుక్రవారం తుది తీర్పు వెల్లడించారు. నలుగురు ముద్దాయిలకు మూడేళ్ల జైలు శిక్ష, రూ.5 వేల చొప్పున జరిమానా విధించారు. బాధితురాలి తరఫున పబ్లిక్ ప్రాసిక్యూటర్ సుజన వాదించారు. సాక్షులను సకాలంలో కోర్టుకు హాజరుపరిచి ముద్దాయిలకు శిక్ష పడేందుకు కృషి చేసిన సీఐ ఇందిర, ఏఎస్ఐ శ్రీనివాసులు, కానిస్టేబుల్ శివయ్యను ఎస్పీ రత్న ప్రత్యేకంగా అభినందించారు.

మొక్కుబడిగా 'మెగా పేరెంట్స్- టీచర్స్ సమావేశాలు'

- జిల్లాలో 1,738 స్కూళ్లలో సమావేశాలు
- అంతంతమాత్రంగానే హాజరైన తల్లిదండ్రులు



కూడేరులో తాడు లాగుడు పోటీని ప్రారంభిస్తున్న కలెక్టర్ వినోద్ కుమార్



సిద్దరాంపురంలో ఎమ్మెల్యే శ్రావణిశ్రీతో మాజీ జెడ్పీటీసీ రామలింగారెడ్డి వాగ్వాదం

అనంతపురం ఎడ్యుకేషన్/ కూడేరు: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన 'మెగా పేరెంట్స్- టీచర్స్' సమావేశాలు జిల్లాలో చాలాచోట్ల మొక్కుబడిగా జరిగాయి. కలెక్టర్ మొదలుకొని టీచరు వరకు వారం రోజులుగా దీనిపై పెద్ద ఎత్తున కసరత్తు చేసినా తల్లిదండ్రులు మాత్రం ఆశించిన స్థాయిలో హాజరు కాలేదు. విద్యార్థుల సంఖ్య ఎక్కువగా ఉన్న స్కూళ్లలో అంతోఇంతో కనిపించినా.. తక్కిన స్కూళ్లలో తల్లిదండ్రులు ఆసక్తి చూపలేదు. తల్లులకు రంగవల్లులు, తండ్రులకు టగ్ ఆఫ్ వార్ పోటీలు నిర్వహించాలని ఆదేశించినా చాలాచోట్ల జరగలేదని తెలిసింది. మొత్తం 1,738 ప్రభుత్వ యాజమాన్య పాఠశాలల్లో సమావేశాలు జరిగినట్లు విద్యాశాఖ అధికారులు తెలిపారు. హోలిస్టిక్ ప్రోగ్రెస్ కార్డులను అందరి విద్యార్థుల తల్లిదండ్రులకు అందజేయాలని ఆదేశించినా వాటిని భర్తీ చేయని కారణంగా ఏ ఒక్క స్కూల్‌లోనూ పూర్తిస్థాయిలో అందివ్వలేదు. ఫొటోల కోసమంటూ కొందరికి అందించారు. ప్రజాప్రతినిధులు, అధికారులు పాల్గొన్నారు. కలెక్టర్ వినోద్‌కుమార్ కూడేరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో జరిగిన సమావేశంలో పాల్గొన్నారు. 'అనంత'లో చదివిన విద్యార్థులు అంతర్జాతీయ స్థాయిలో నిలవాలని కలెక్టర్ ఆకాంక్షించారు. మొబైల్ వాడకాన్ని తగ్గించి పుస్తకపఠనం, వ్యాయామం, క్రీడలు, కళలపై దృష్టి సారించాలని కోరారు. అనంతపురంలోని రాజేంద్ర నగరపాలక ఉన్నత పాఠశాలలో జరిగిన సమావేశానికి జాయింట్ కలెక్టర్ శివ్ నారాయణ్ శర్మ, ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ప్రభుత్వ విద్యను బలోపేతం చేయాల్సిన బాధ్యత అందరిపైనా ఉందని జేసీ అన్నారు. అనంతపురం రూరల్ మండలం అంబేడ్కర్ గురుకుల పాఠశాలలో జరిగిన పేరెంట్స్-టీచర్స్ మీటింగ్‌లో ఎస్పీ జగదీష్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. డ్రగ్స్ రహిత సమాజమే లక్ష్యంగా సమష్టిగా కృషి చేద్దామని పిలుపునిచ్చారు. మాదక ద్రవ్యాల వినియోగం వల్ల కలిగే దుష్పరిణామాలపై అవగాహన కల్పించారు.

సిద్దరాంపురంలో రసాభాస

బుక్కరాయసముద్రం : సిద్దరాంపురంలోని ప్రభుత్వ పాఠశాలలో పిల్లల తల్లిదండ్రులు, ఉపాధ్యాయుల సమావేశం రసాభాసగా జరిగింది. హెచ్‌ఎం నీరజ అధ్యక్షతన నిర్వహించిన సమావేశానికి ముఖ్య అతిథిగా శింగనమల ఎమ్మెల్యే బండారు శ్రావణిశ్రీ హాజరయ్యారు. అధికారులు ప్రొటోకాల్ పాటించలేదని ఎమ్మెల్యేతో ద్విసభ్య కమిటీ సభ్యుడు, మాజీ జెడ్పీటీసీ రామలింగారెడ్డి వాగ్వాదానికి దిగారు. తమ నాయకుడిని అవమానపరిచే విధంగా ఎమ్మెల్యే వ్యవహరిస్తున్నారని పలువురు టీడీపీ కార్యకర్తలు ఆందోళనకు దిగారు. ఇరు వర్గాల నడుమ మాటలయుద్ధం తారస్థాయికి చేరుకోవడం చూసి పిల్లల తల్లిదండ్రులు విస్తుపోయారు. పోలీసులు రంగప్రవేశం చేసి కార్యకర్తలను స్టేజీ వద్ద నుంచి పంపించి వేశారు. అనంతపురం డీఎస్పీ వెంకటేశ్వర్లు సిద్దరాంపురం చేరుకుని నాయకులతో మాట్లాడి సర్దిచెప్పారు.

పామిడి : మండలంలోని రామగిరిలో నిర్వహించిన మెగా పేరెంట్ టీచర్స్ మీటింగ్‌లో ప్రొటోకాల్‌పై ఎంపీటీసీ మజ్జిగ రాజశేఖర్ ధ్వజమెత్తారు. ప్రభుత్వ కార్యక్రమాల్లో ప్రజాప్రతినిధులకు ప్రాధాన్యత ఇవ్వకపోవడం ఎంతవరకు సమంజసమంటూ మండిపడ్డారు.

క్లుప్తంగా

కర్ణాటక మద్యం పట్టివేత

గుంతకల్లు: అక్రమంగా తరలిస్తున్న కర్ణాటక మద్యాన్ని పట్టుకున్నట్లు ఎక్సైజ్ సీఐ జీ.శివ సాగర్ తెలిపారు. శనివారం రాజేంద్రనగర్‌లోని ఎక్సైజ్ పోలీసుస్టేషన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. స్థానిక బీరప్ప గుడి సర్కిల్‌లో తనిఖీలు చేస్తుండగా బళ్లారి వైపు నుంచి వస్తున్న కారు (ఏపీ40 బీకే 1520)లో కర్ణాటక మద్యాన్ని గుర్తించామన్నారు. కారులో ఉన్న అంజన్ పవన్‌కుమార్, బోయ వాసులను అదుపులోకి తీసుకుని దాదాపు 20 బాక్సుల (టెట్రా ప్యాకెట్లు 1950) మద్యాన్ని స్వాధీనం చేసుకున్నట్లు వివరించారు. అలాగే మండల పరిధిలోని ములకలపెంట శివారులోని 550 లీటర్ల బెల్లపు ఊటను ధ్వంసం చేయడంతో పాటు 15 లీటర్ల నాటు సారాను స్వాధీనం చేసుకుని ఇద్దరిని అరెస్టు చేశామని పేర్కొన్నారు. వారిని రిమాండ్‌కు తరలించినట్లు తెలిపారు. ఎస్‌ఐ సుశీలమ్మ, హెడ్ కానిస్టేబుళ్లు సుబ్బయ్య, వెంకటేష్, కానిస్టేబుళ్లు మారుతి, జగదీష్ తదితరులు పాల్గొన్నారు.

కళ్యాణదుర్గంలో...

కళ్యాణదుర్గం: కర్ణాటక నుంచి అక్రమంగా రెండు ద్విచక్ర వాహనాల్లో 15 బాక్సుల్లో తరలిస్తున్న 1440 టెట్రా ప్యాకెట్లను కుందుర్పికి వెళ్లే ప్రధాన రహదారిపై శనివారం స్వాధీనం చేసుకున్నట్లు చేసుకున్నట్లు సీఐ అన్నపూర్ణ తెలిపారు. కర్ణాటక రాష్ట్రం చెళ్లకెర మండలం తిప్పరెడ్డిహళ్లికి చెందిన కె.శ్రీనివాస్, కళ్యాణదుర్గం పరిధిలోని మారెంపల్లికి చెందిన పి.నాగరాజు, కళ్యాణదుర్గం మండలం ముదిగల్లుకు చెందిన కుర్రా తిప్పేస్వామిని అదుపులోకి తీసుకున్నామన్నారు.

పంట పొలాల్లో పశ్చిమ రాగం


అరటి తోటల వద్దకు పోతున్న వలస కూలీలు

- అరటి తోటల్లో బెంగాల్ కూలీల సాయం
- నెలల తరబడి ఇక్కడే పనులు
- కూలీల కొరత తీరిందంటున్న రైతులు

పొట్టకూటి కోసం వందల కిలోమీటర్లు దాటి వస్తున్నారు ఎందరో కూలీలు. కుటుంబాలతో సహా తరలివచ్చి గ్రామ శివార్లలో నివాసం ఉంటూ జీవనం సాగిస్తున్నారు. స్థానికంగా కూలీల కొరత ఉండటంతో కొందరు రైతులు, వ్యాపారులు బయటి రాష్ట్రాల నుంచి కూలీలను తెచ్చుకుంటున్నారు. ఇక్కడ కూలి గిట్టుబాటు అవుతోందని వారు కూడా ఎంతో సంతోషంగా పనులు చేస్తున్నారు.


పశ్చిమ బెంగాల్‌కు చెందిన వలస కూలీలు

యాడికి: వ్యవసాయ పనులకు కూలీల కొరతతో అల్లాడుతున్న రైతాంగానికి వలస కూలీలతో ఉపశమనం లభిస్తోంది. ఉపాధి కోసం వలస కూలీలు సొంత ఊర్లను వదిలి ఇక్కడికి వచ్చి గ్రామ శివార్లలో రేకుల షెడ్లలో జీవనం సాగిస్తున్నారు. చలికి వణుకుతూ, ఎండకు ఎండుతూ, వానకు తడుస్తూనే పని చేస్తూ ఉపాధి పొందుతున్నారు.

అరటి పంటకు వలస కూలీలే దిక్కు

యాడికి మండలంలోని 14 పంచాయతీల్లో 1900 ఎకరాల్లో అరటి పంటను రైతులు సాగు చేశారు. అరటి పంటలో మొక్కలపైన, కింద విష పురుగుల ఉంటాయి. దీంతో స్థానికంగా ఉన్న కూలీలు భయపడుతూ కూలి పనులకు రావడం లేదు. కూలీల కొరత ఉండటంతో ఈ ప్రాంత రైతులు వలస కూలీలపై ఆధారపడుతున్నారు. పశ్చిమ బెంగాల్ రాష్ట్రంలోని మల్దా జిల్లాకు చెందిన కూలీలు ఉపాధి నిమిత్తం 200 మందికిపైగా ఇక్కడికి వస్తుంటారు. రైతులు వారికి కొంత డబ్బు అడ్వాన్స్‌గా చెల్లించి అరటి గెలలకు మందును స్ప్రే చేసేందుకు , గెలలు కోత కోసేందుకు, వాటిని ప్రత్యేకంగా ప్యాకింగ్ చేసేందుకు రప్పించుకుంటున్నారు. యాడికి మండలంలోని రాయలచెరువు, చందన గ్రామాల్లో వలస కూలీలు ఉపాధి పొందుతున్నారు. 2018 నుంచి నేటి వరకూ మండలంలోని చందన గ్రామానికి చెందిన వరదారెడ్డి గారి శంకర్ రెడ్డి తోటల్లో 200 మంది కూలీలు పని చేస్తున్నారు.

ఏడు నెలల ఉపాధి

ఇతర రాష్ట్రాల నుంచి వలస కూలీలు తమ బంధువులు, స్నేహితులతో కలిసి ఇక్కడికి వస్తుంటారు. చందన గ్రామానికి చెందిన శంకర్‌రెడ్డి తన వ్యవసాయ బోరుబావుల వద్ద దాదాపు అర ఎకరా స్థలంలో పెద్ద ఎత్తున రేకుల షెడ్డులు వేసి విద్యుత్ సౌకర్యం, నీటి వసతి కల్పించారు. శంకర్‌రెడ్డి తనకున్న వ్యవసాయ తోటల్లో అరటి సాగు చేశారు. అలాగే మరో 300 ఎకరాల్లో గ్రామానికి చెందిన రైతులు అరటి సాగు చేశారు. వారి పంటను శంకర్‌రెడ్డి కొనుగోలు చేస్తుంటారు. అక్టోబర్ నుంచి అరటి మొక్కలకు ,గెలలకు మందులను స్ప్రే చేయిస్తారు. పంట చేతికొచ్చిన తర్వాత 10 వేల టన్నుల అరటి కాయలను బాక్సుకు రూ. 25ల చొప్పున ప్రత్యేకంగా 20 మందిని ఒక టీమ్‌గా ఏర్పరచి ప్యాకింగ్ చేయిస్తారు. ప్యాకింగ్ చేసిన అరటి బాక్సులను ఏసీ కంటైనర్ ద్వారా ముంబయి తరలించి అక్కడి నుంచి సముద్ర మార్గం గుండా గల్ఫ్ దేశాలకు ఎగుమతి చేస్తుంటారు. పంటపై మందు స్ప్రే చేసేందుకు రోజూ కూలి రూ.500 నుంచి రూ.700 వరకూ చెల్లిస్తుంటారు. అరటిని ప్యాకింగ్ చేసేరోజు టీమ్‌లోని ప్రతి వలస కూలీ రూ. వెయ్యి వరకూ సంపాదిస్తుంటారు. ఇలా ఏడు నెలల వరకూ ప్రతి కూలీకి ఉపాధి దొరుకుతోంది.

ఉమ్మడి జిల్లా అంతటా...

ఉమ్మడి అనంతపురం జిల్లాలోని వివిధ ప్రాంతాల్లోనూ వలస కూలీలు వివిధ పనులు చేస్తూ జీవనం సాగిస్తున్నారు. పెనుకొండ నియోజకవర్గంలోని పలు మండలాల్లో ముఖ్యంగా ఇటుకల బట్టీల్లో ఇతర రాష్ట్రాలకు చెందిన వారు కూలీలుగా పనిచేస్తున్నారు. అలాగే హిందూపురం, అనంతపురం, గుంతకల్లు, రాయదుర్గం తదితర ప్రాంతాల్లోనూ గృహ నిర్మాణ పనుల్లో వలస కూలీలే ఎక్కువగా పనిచేస్తున్నారు.

రెండేళ్లుగా వస్తున్నాం



మాది పశ్చిమ బెంగాల్‌లోని మల్దా జిల్లా. రెండేళ్లుగా యాడికి మండలంలో అరటి పంటలో కూలీలుగా వస్తున్నాం. మా ప్రాంతంలో పంటలు పూర్తిగా దెబ్బతిని ఉపాధి కరువైంది. అరటి పంటలో పనులు ఎక్కువగా ఉండటంతో ఇక్కడికి వచ్చాం. వచ్చే ఏడాది ఏప్రిల్ వరకూ ఇక్కడే ఉండి పని పూర్తయిన తర్వాత మా గ్రామానికి వెళ్తాం.

– మానుస్, మాల్దా జిల్లా, పశ్చిమ బెంగాల్

కూలి గిట్టుబాటు అవుతోంది



మా గ్రామంలో పని దొరకక వలస వస్తున్నాం. మా ఊర్లో పని చేస్తే రోజు కూలి రూ.300 ఇస్తారు. అయితే యాడికి మండలం చందనలో రూ. 500 నుంచి రూ.1000 వరకూ దొరకుతోంది. కూలి గిట్టుబాటు అవుతోంది. పొట్ట కూటి కోసం వస్తున్నా ఆనందంగానే పనిచేసుకుంటున్నాము.

– సాజన్, మాల్దా జిల్లా, పశ్చిమ బెంగాల్

అన్ని సౌకర్యాలు కల్పించాం



ఏడేళ్లుగా అరటి కాయల వ్యాపారం చేస్తున్నాను. నా దగ్గర పశ్చిమ బెంగాల్‌కు చెందిన 200 మంది వలస కూలీలు ఉన్నారు. అరటి కాయలను బాగా ప్యాకింగ్ చేస్తారు. వారు ఉండేందుకు 3 షెడ్డులు ఏర్పాటు చేయటమే కాకుండా అన్ని సౌకర్యాలు కల్పించాము.

– శంకర్‌రెడ్డి, అరటి కాయల వ్యాపారి, యాడికి

ఫేక్ పట్టాలపై అధికారుల కొరడా

- నకిలీ పట్టాలతో పేదలను నిలువునా ముంచిన వ్యక్తికి కటకటాలు
- మిగతా వారిపైనా దృష్టిసారించిన అధికారులు

సాక్షి ఎఫెక్ట్..



రాప్తాడురూరల్: అనంతపురం నగరంలో సొంతిల్లు నిర్మించుకోవాలనే నిరుపేదల ఆశలను ఆసరాగా చేసుకుని ఫేక్ పట్టాలు సృష్టిస్తున్న వారి భరతం పడుతున్నారు అధికారులు. 'సాక్షి' దినపత్రికలో ఇటీవల వరుసగా 'అమ్మేశారు...ముంచేశారు', 'రూ. 5 వేలు కొట్టు.. పట్టా పట్టు', 'రూపాయికో పట్టా' శీర్షికలతో ప్రత్యేక కథనాలు ప్రచురితమయ్యాయి. దీంతో కలెక్టర్ వినోద్‌కుమార్, ఎస్పీ జగదీష్ స్పందించారు. వారి ఆదేశాల మేరకు రెవెన్యూ, పోలీసు అధికారులు రంగంలోకి దిగారు. తహసీల్దార్ మోహన్‌కుమార్...రాతపూర్వకంగా ఫిర్యాదు చేశారు. ఇందులో భాగంగా అనంతపురం రూరల్ కురుగుంటకు చెందిన ఎస్.నాగభూషణం ఇంటిపై రూరల్ పోలీసులు దాడులు చేశారు. కొన్ని నకిలీ పట్టాలను గుర్తించి సీజ్ చేశారు. శుక్రవారం నిందితుడిని అరెస్ట్ చేసి కోర్టులో హాజరుపరచగా జడ్జి రిమాండ్‌కు ఆదేశించారు. రెవెన్యూ అధికారులు ఫిర్యాదు చేస్తే కేసులు నమోదు చేస్తామని రూరల్ సీఐ శేఖర్ తెలిపారు.

కూపీ లాగుతున్న రెవెన్యూ అధికారులు

అనంతపురం రూరల్ మండల పరిధిలోని ఉప్పరపల్లి, కురుగుంట, రాచానపల్లి, సోములదొడ్డి, కొడిమి, చిన్నంపల్లి, కక్కలపల్లికాలనీ పంచాయతీల పరిధిలో అక్రమార్కులు రెచ్చిపోయారు. నకిలీ పట్టాలతో అవసరాన్ని బట్టి రూ. 20 వేల నుంచి రూ. 50 వేలదాకా వసూళ్లకు పాల్పడి రూ.కోట్లు వెనుకేసుకున్నారు. బాధితులు తహసీల్దార్ కార్యాలయానికి వెళ్లి చూపిస్తుంటే తమ పేర్లు రికార్డుల్లో లేవని అవన్నీ నకిలీ పట్టాలని చెబుతున్నారు. దీంతో తాము మోసపోయామని గ్రహించిన కొందరు బాధితులు అధికారులను కలిసి నేరుగా ఫిర్యాదులు చేస్తున్నారు. వచ్చిన ఫిర్యాదులపై రెవెన్యూ అధికారులు కూపీ లాగుతున్నారు. నకిలీ పట్టాలు అంటగట్టిన వారిపై డేగకన్ను పెడుతున్నారు. బాధితులతో ఫిర్యాదులు తీసుకుని నేరుగా క్రిమినల్ కేసులు పెట్టేందుకు సన్నద్ధమవుతున్నారు. నకిలీ పట్టాలు సృష్టికర్తల్లో వణుకు పట్టుకుంది. కురుగుంట సమీపంలో ఓ ఆటో డ్రైవర్ ఇంట్లోనూ నకిలీ పట్టాలతో పాటు తహసీల్దార్ సీలు, కార్యాలయం సీలు ఉంచుకున్నట్లు తెలిసింది. నకిలీ పట్టాలు సృష్టించి పేదలను నిలువునా మోసగించి డబ్బులు వసూళ్లు చేసిన ముఠాలపై కఠిన చర్యలు తీసుకుంటామని తహసీల్దార్ మోహన్ కుమార్ తెలిపారు. బాధితులు నేరుగా వచ్చి తనకు ఫిర్యాదు చేయాలన్నారు.

డ్రగ్స్ వద్దు బ్రో ...



డ్రగ్స్ అనర్థాలను వివరించేలా అవగాహన సదస్సు నిర్వహిస్తున్న దృశ్యం

అనంతపురం: జిల్లా వ్యాప్తంగా ఆయా పాఠశాలల్లో నిర్వహిస్తున్న ' మెగా టీచర్స్ పేరెంట్ 'సమావేశాలకు హాజరువుతున్న విద్యార్థులకు పోలీసులు 'డ్రగ్స్ వద్దు బ్రో' అనే నినాదంతో అవగాహన కల్పిస్తున్నారు. డీఎస్పీలు, సీఐలు, ఎస్‌ఐలు అవగాహన సదస్సుల్లో పాల్గొంటూ అనర్థాలను వివరిస్తున్నారు.

త్వరలో ధాన్యం కొనుగోళ్లు

కణేకల్లు: హెచ్చెల్సీ ఆయకట్టు ప్రాంతమైన కణేకల్లు, బొమ్మనహాళ్ మండలాల్లో త్వరలో వరికొనుగోళ్లను ప్రారంభిస్తామని పౌర సరఫరాలశాఖ జిల్లా మేనేజర్ రమేష్‌రెడ్డి, డీఏఓ ఉమామహేశ్వరమ్మ తెలిపారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో శనివారం వరికొనుగోళ్ల ప్రక్రియపై సిబ్బందికి శిక్షణ ఇచ్చారు. వారు మాట్లాడుతూ ఏ గ్రేడ్ రూ.2,320, సాధారణ రకం రూ.2,300 తో కొనుగోలు చేస్తామన్నారు. జిల్లా వ్యాప్తంగా 5 వేల మెట్రిక్ టన్నుల వరిధాన్యాన్ని కొనుగోలు చేయనున్నట్లు పేర్కొన్నారు. వరిలో తేమశాతం 17 ఉన్నా కొనుగోలు చేయాలని సూచించారు.

ఫీల్డ్ అసిస్టెంట్ ఆత్మహత్య


నరేష్ (ఫైల్)

ఆత్మకూరు: మండలంలోని పంపనూరు గ్రామానికి చెందిన ఫీల్డ్ అసిస్టెంట్ నరేష్ (26) ఆర్థిక ఇబ్బందులతో శనివారం తన ఇంటి సమీపంలోని చెట్టుకు ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. బంధువులు, పోలీసుల వివరాలమేరకు.. నరేష్ వాళ్ల నాన్న వెంకటేష్ పొలంలో బోర్లు వేసి అప్పులు చేశాడు. ఇటీవల నరేష్ తండ్రి మరణించాడు. మరోవైపు నరేష్ వివాహం చేసుకున్న కొద్ది రోజులకే అతని భార్య వదిలేసి వెళ్లి పోయింది. ఒక వైపు ఆర్థిక ఇబ్బందులు, మరోవైపు భార్య వదిలేసిందన్న మనస్తాపంతో ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. ఉదయం లేవగానే నరేష్ వాళ్ల అమ్మ నాగలక్ష్మి, తమ్ముడు తిరుమల రాజు బయటకు వచ్చి చూడగా చెట్టుకు నరేష్ వేలాడుతూ కనిపించాడు. పోలీసులు సంఘటనా స్థలాన్ని పరిశీలించి మృతదేహాన్ని పోస్టుమార్టం చేయించి కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

అనుమానాస్పదస్థితిలో వృద్ధుడి మృతి




మృతుడు కంబగిరి

తాడిపత్రి రూరల్: స్థానిక రైల్వేస్టేషన్‌లో శనివారం నడిపి కంబగిరి (60) అనుమానాస్పదంగా మృతి చెందాడు. పోలీసుల వివరాలమేరకు.. నంద్యాల జిల్లా కనకాద్రిపల్లికి చెందిన నడిపి కంబగిరి చిత్తూరులోని గ్రానైట్ ఫ్యాక్టరీలో వాచ్‌మెన్‌గా పనిచేస్తున్నాడు. చిత్తూరుకు వెళ్లేందుకు మంగళవారం ఉదయం కనకాద్రిపల్లిలో బస్సు ఎక్కి తాడిపత్రికి వచ్చారు. రైలు ఎక్కి చిత్తూరుకు వెళ్లడానికి తాడిపత్రి రైల్వేస్టేషన్‌కు వచ్చాడు. మొదటి ప్లాట్ ఫారం చివరిలో తీవ్ర గాయాలతో పడి ఉన్న కంబగిరి గురించి ప్రయాణికులు రైల్వే పోలీసులకు సమాచారం అందించారు. వారు వచ్చి పరిశీలించి అనుమానాస్పద మృతిగా ఉండటంతో తాడిపత్రి పట్టణ పోలీసులకు సమాచారమిచ్చారు. మృతి దగ్గర లభించిన ఆధార్‌కార్డు ఆధారంగా కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

బేల్దార్లపై పోకిరీల రాళ్ల దాడి


తీవ్రంగా గాయపడిన నాగేంద్ర

తాడిపత్రిటౌన్: పట్టణంలోని కృష్ణాపురం ఒకటో రోడ్డులో పోకిరీల రాళ్ల దాడిలో ముగ్గురు బేల్దార్లకు తీవ్రగాయాలు అయ్యాయి. వారిలో ఒకరి పరిస్థితి విషమంగా ఉంది. స్థానికుల వివరాల మేరకు.. పట్టణంలోని కృష్ణాపురం ఒకటో రోడ్డులో ఇద్దరు పోకిరీలు గొడవ పడుతూ రాయి వేయడంతో చిన్నపాపతో స్కూటీపై వెళ్తున్న మహిళకు తగిలింది. పని ముగించుకొని ఇంటికి వెళ్తున్న బేల్దార్లు జయనగర్ కాలనీ చెందిన సుబ్బరాయుడు, టైలర్స్ కాలనీకి చెందన శంకర్ నారాయణ, విజయనగర్ కాలనీకి చెందిన నాగేంద్రలు గమనించి పోకిరీలను ప్రశ్నించారు. దీంతో వారు అక్కడి నుంచి వెళ్లి దాదాపు 20 మందితో వచ్చి బేల్దార్లపై రాళ్ల వర్షం కురిపించారు. దీంతో ముగ్గురికి తీవ్రగాయాలయ్యాయి. నాగేంద్ర పరిస్థితి విషమంగా మారడంతో మెరుగైన చికిత్స నిమిత్తం అనంతపురం ఆస్పత్రికి తరలించారు. ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.



గాయపడిన శంకర్‌నారాయణ, సుబ్బరాయుడు

జీతాలు ఇవ్వండి మహాప్రభో

- సమగ్ర శిక్ష ఉద్యోగుల వేడుకోలు

అనంతపురం ఎడ్యుకేషన్: దేవుడు వరమిచ్చినా పూజారి కరుణించలేదన్న చందంగా తయారైంది జిల్లాలోని సమగ్ర శిక్ష ఉద్యోగుల పరిస్థితి. సమగ్ర శిక్ష ఏపీసీగా పని చేస్తున్న నాగరాజును నవంబరు 30న డైరెక్టర్ కార్యాలయానికి బదిలీ చేశారు. ఆయన అదేరోజు ఇక్కడి నుంచి రిలీవ్ అయ్యారు. ఆయన స్థానంలో ఇప్పటిదాకా ఎవరికీ ఇన్‌చార్జ్ ఇవ్వలేదు. దీంతో సమగ్ర శిక్ష పరిధిలో పని చేస్తున్న ఉద్యోగులకు నవంబరు జీతాలకు కొర్రీ పడింది. రాష్ట్ర వ్యాప్తంగా 25 జిల్లాల్లోనూ ఉద్యోగులకు వేతనాలు పడ్డాయి. అనంతపురం జిల్లాలో మాత్రం ఏపీసీ లేని కారణంగా నేటికీ జీతాలు జమ కాలేదు.

1500 మంది ఉద్యోగుల ఎదురుచూపు

సమగ్ర శిక్ష పరిధిలో కేజీబీవీ టీచింగ్, నాన్ టీచింగ్, సీఆర్పీలు, పార్ట్‌టైం ఇన్‌స్ట్రక్టర్లు, ఎమ్మార్సీ ఉద్యోగులు ఎంఐఎస్ కోఆర్డినేటర్లు, డేటా ఎంట్రీ ఆపరేటర్లు, అకౌంటెంట్లు, మెసెంజర్లు, భవిత కేంద్రాల్లో పని చేస్తున్న ఐఈఆర్పీలు, ఆయాలు, ఫిజియోథెరపిస్టులు, ఇంజినీరింగ్ విభాగంలో సైట్ ఇంజినీర్లు, మోడల్ స్కూళ్లలోని ఔట్ సోర్సింగ్ ఉద్యోగులు, డీపీఓలోని రెగ్యులర్, ఔట్ సోర్సింగ్ ఉద్యోగులు దాదాపు 1500 మంది పని చేస్తున్నారు. నవంబరు నెలకు సంబంధించి వేతనాల బడ్జెట్ రూ. 3.19 కోట్లు ఈనెల 2న ప్రభుత్వం విడుదల చేసింది. అయితే ఏపీసీ లేని కారణంగా జీతాలు ఇంత వరకూ పడలేదు. ఉన్నతాధికారులు స్పందించి వెంటనే ఏపీసీ ఇన్‌చార్జ్ బాధ్యతలు ఎవరికైనా అప్పగించి జీతాల మంజూరుకు చర్యలు తీసుకోవాలని ఉద్యోగులు విజ్ఞప్తి చేస్తున్నారు.

ఆర్భాటమేనా.. అమలేదీ?

- అరకొర పంట ఉత్పత్తులు అమ్ముకునేందుకూ అవస్థలు
- కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయని ప్రభుత్వం
- దళారులను ఆశ్రయించి తక్కువ ధరకే అమ్ముకుంటున్న దుస్థితి


మొక్కజొన్న

అనంతపురం అగ్రికల్చర్: కూటమి సర్కారు వ్యవసాయరంగంపై నిర్లక్ష్యం ప్రదర్శిస్తోంది. గతి తప్పి కురిసిన వర్షాలకు అరకొరగా వచ్చిన ఖరీఫ్ పంట ఉత్పత్తులకు మార్కెట్‌లో గిట్టుబాటు ధరలు లభించడం లేదు. కనీస మద్దతు ధర (ఎంఎస్‌పీ)తో కొనుగోలు చేయడానికి రాష్ట్ర ప్రభుత్వం కేంద్రాలు కూడా ఏర్పాటు చేయడం లేదు. దీంతో పండిన అరకొర వ్యవసాయ ఉత్పత్తులను రైతులు దళారులను ఆశ్రయించి అయినకాటికి అమ్ముకుని నష్టపోతున్నారు.

కొనుగోళ్ల కోసం ఎదురుచూపు

వేరుశనగ, పత్తి, మొక్కజొన్న, వరి, ఆముదం, కందులు తదితర పంట ఉత్పత్తులు అమ్ముకునేందుకు రైతులు అవస్థలు పడుతున్నారు. కాటన్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా (సీసీఐ) ఆధ్వర్యంలో తాడిపత్రి, గుత్తిలో పత్తి కొనుగోలు చేస్తామని మార్కెటింగ్‌శాఖ ప్రకటించి నెల రోజులు కావస్తున్నా అతీగతి కనిపించడం లేదు. రైతులు ఆదోని లాంటి ప్రాంతాలకు వెళ్లి ఎంఎస్‌పీ కన్నా తక్కువకే అమ్ముకుంటున్నారు. మార్క్‌ఫెడ్ ఆధ్వర్యంలో మొక్కజొన్న, కందులు కొనుగోలు చేస్తామని ప్రకటించినా ఇప్పటి వరకు వాటి ఊసేలేదు. ఆయిల్‌ఫెడ్ ఆధ్వర్యంలో వేరుశనగ కొంటామన్నా దిక్కులేదు. పౌరసరఫరాలశాఖ ఆధ్వర్యంలో ధాన్యం కొనుగోళ్లు కూడా చేపట్టకపోవడంతో రైతుల పరిస్థితి దారుణంగా తయారైంది.

ఖరీఫ్–రబీ పంటల మద్దతు ధరలు

2024 ఖరీఫ్, 2024–25 రబీ పంట ఉత్పత్తులకు ఈ ధరలు వర్తించనున్నాయి. అందులో ఉమ్మడి జిల్లాకు సంబంధించి తీసుకుంటే వరి, వేరుశనగ, కందులు, మొక్కజొన్న, పత్తి లాంటి ముఖ్యమైనవి. వేరుశనగ విషయానికి వస్తే గతేడాది కన్నా క్వింటాలుపై రూ.406 పెంపుదల చేశారు. అలాగే పత్తికి రూ.501, కందులకు రూ.550, మొక్కజొన్నకు రూ.135, వరిధాన్యంపై రూ.117, అత్యధికంగా నువ్వులపై రూ.632, రాగులపై రూ.444, మినుములపై రూ.450, అత్యధికంగా నైగర్‌సీడ్ (వెర్రినువ్వులు–ఒడిసెలు)కు రూ.983 ప్రకారం నిర్ణయించారు.

అధ్వానంగా సంక్షేమ హాస్టళ్లు

- నివ్వెర పోయిన విజిలెన్స్ అధికారులు
- ప్రభుత్వానికి నివేదిక



ఎస్సీ హాస్టల్‌లో అధ్వానంగా ఉన్న మరుగుదొడ్డి, హాలులోనే భోజనం వండుతున్న వైనం

అనంతపురం/అనంతపురం రూరల్: ప్రభుత్వ హాస్టళ్ల దుస్థితిపై విజిలెన్స్ అధికారులు నివ్వెరపోయిన పరిస్థితి నెలకొంది. నగరంలోని లక్ష్మీ నగర్ కాలనీ గంగమ్మ గుడి వద్ద ఉన్న ప్రభుత్వ సోషల్ వెల్ఫేర్ కాలేజీ బాయ్స్ హాస్టల్ నెంబర్-2ను విజిలెన్స్ అధికారులు శనివారం తనిఖీ చేశారు. ఇందులో విస్తుపోయే అంశాలను విజిలెన్స్ అధికారులు ప్రభుత్వానికి నివేదించారు. 111 మంది విద్యార్థులకుగాను 4 స్నానపు గదులు, 4 మరుగుదొడ్లు మాత్రమే ఉన్నాయి. అవి కూడా అత్యంత అపరిశుభ్రంగా ఉన్నాయి. హాస్టల్ వంట సరుకుల నిల్వ, హాజరు పట్టిక, బయోమెట్రిక్ హాజరులోనూ వ్యత్యాసాలున్నాయి. విద్యార్థుల గదులు, వంట గది, స్నానపు గదులు, మరుగుదొడ్లు దుర్గంధం వెదజల్లుతున్నాయి. హాస్టల్ వార్డెన్‌పై వారు ఆగ్రహం వ్యక్తం చేశారు. విజిలెన్స్ డీఎస్పీ నాగభూషణం, సీఐ శ్రీనివాసులు, ఏఓ జే.వాసు ప్రకాష్ సిబ్బంది తనిఖీల్లో పాల్గొన్నారు.

క్లుప్తంగా

రేషన్ డీలర్‌పై కేసు నమోదు



రేషన్ షాపును తనిఖీ చేస్తున్న విజిలెన్స్ అధికారులు

అనంతపురం: నగరంలోని వేణుగోపాల్ నగర్, నీరుగంటి వీధిలోని రేషన్ షాపుల్లో శనివారం విజిలెన్స్ అధికారులు ఆకస్మికంగా తనిఖీలు నిర్వహించారు. రేషన్ షాపులో పుస్తకాల్లో నమోదైన వివరాలకు, భౌతిక నిల్వలకు వ్యత్యాసం ఉండటంతో ఆగ్రహం వ్యక్తం చేశారు. భౌతిక నిల్వలను జప్తు చేసి రెవెన్యూ అధికారులకు అప్పగించారు. రేషన్ షాపు డీలర్ బి.రాజేశ్వరిపై కేసు నమోదు చేసినట్లు విజిలెన్స్ అధికారులు తెలిపారు. తనిఖీల్లో ఐటీపీ ఎస్.జమాల్ బాషా, ఏఈఈ ఎల్.రవీంద్రనాథ్, వీఆర్వో వినోద్ కుమార్ పాల్గొన్నారు.

విజయ్‌సాయికి సేవారత్న అవార్డు

అనంతపురం కల్చరల్: అంతర్జాతీయ సామాజికవేత్తల దినోత్సవాన్ని పురస్కరించుకుని శనివారం రాత్రి విజయవాడలో పాన్ ఇండియా కల్చరల్ సోషియో ఆర్గనైజేషన్ వారు రెండు తెలుగు రాష్ట్రాల్లో విస్తృతంగా సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్న 8 మందికి పురస్కారాలు అందజేశారు. అనంతకు చెందిన సాయిట్రస్టు అధినేత విజయ్ కుమార్‌కు సేవారత్న జాతీయ స్థాయి అవార్డు అందజేసి సత్కరించారు.

40 మందికి ఉద్యోగాలు



ఉద్యోగాలకు ఎంపికైన విద్యార్థులతో పీవీకేకే కళాశాల సిబ్బంది

అనంతపురం రూరల్: పీవీకేకే ఇంజినీరింగ్ కళాశాలలో ష్నైడర్ ఎలక్ట్రిక్ సంస్థ ఆధ్వర్యంలో శనివారం నిర్వహించిన ప్రాంగణ నియామకాల్లో 40 మంది విద్యార్థులకు ఉద్యోగాలు లభించినట్లు ప్రిన్సిపాల్ రమేష్‌బాబు తెలిపారు. ఉద్యోగాలకు ఎంపికైన వారిని హైదరాబాద్, బెంగళూరులో గ్రాడ్యుయేట్ ట్రైనీలుగా నియమిస్తారని తెలిపారు. వార్షిక ఆదాయం రూ.2.60 లక్షలు ఉంటుందన్నారు. కార్యక్రమంలో కళాశాల చైర్మన్ పల్లె కృష్ణకిశోర్, సిబ్బంది శ్రీకాంత్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పాఠశాల అభివృద్ధికి విరాళాలు



పాఠశాల అభివృద్ధికి ఆర్థికసాయం అందజేస్తున్న దృశ్యం

రాప్తాడు: 'మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో క్రీడా మైదానం లేక ఇబ్బందులు పడుతున్నాం. క్రీడా మైదానానికి 3 ఎకరాలు కేటాయించాలి. పాఠశాల అభివృద్ధికి తోడ్పాటు అందించాలి' అని హెచ్‌ఎం సాంబశివ, తోటి సిబ్బంది ఎమ్మెల్యే పరిటాల సునీతను కోరారు. స్పందించిన ఎమ్మెల్యే తన వంతు సాయంగా సభా వేదికకు సంబంధించి పైకప్పు వేయడానికి రూ.లక్ష ఇస్తానని ప్రకటించారు. ఇరవై రోజుల్లో పని పూర్తి చేయిస్తానని హామీ ఇచ్చారు. అనంతరం సర్పంచ్ సాకే తిరుపాలు రూ.50 వేలు, పాఠశాల కమిటీ చైర్మన్ గంగి లక్ష్మీదేవి, ఆమె భర్త గంజి నాగేంద్ర రూ.30 వేలు, ఎంపీడీఓ కార్యాలయ సిబ్బంది రూ.20 వేలు, తహసీల్దార్ కార్యాలయ సిబ్బంది రూ.20 వేలు, మరికొంత మంది రూ.10 వేలు చొప్పున రూ.80 వేలు దాదాపుగా రూ.2 లక్షలు అందజేస్తామని హామీ ఇచ్చారు.

'హంద్రీ-నీవా లైనింగ్ పనులు చేపట్టొద్దు'



ధర్నా చేస్తున్న రైతు సంఘం నాయకులు

అనంతపురం సెంట్రల్: హంద్రీ-నీవా కాలువ లైనింగ్ పనులు చేపట్టరాదని సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి చింతల మల్లికార్జున డిమాండ్ చేశారు. శనివారం సీపీఐ ఆధ్వర్యంలో హంద్రీ-నీవా కార్యాలయం ఎదుట ఆందోళన నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. హంద్రీ-నీవా ప్రధాన కాలువ లైనింగ్ పనులు చేపట్టేందుకు ప్రభుత్వం అనుమతి ఇచ్చిందన్నారు. దీని వలన రైతాంగానికి తీవ్ర అన్యాయం జరుగుతుందని ఆందోళన వ్యక్తం చేశారు. ప్రధాన కాలువ ద్వారా నీటిని ముందుకు తీసుకెళ్లకుండా డిస్ట్రిబ్యూటరీలు చేపట్టి ఆయకట్టు, చెరువులకు నీటిని విడుదల చేయాలన్నారు. రాప్తాడు నియోజకవర్గంలో అత్యధికంగా 75 వేల ఎకరాల ఆయకట్టు ఉందని తెలిపారు. ప్రస్తుతం నీటిని విడుదల చేయకపోవడంతో ఆయకట్టు మొత్తం బీడుగా ఉందని తెలిపారు. ప్రజాప్రతినిధులు జోక్యం చేసుకుని రైతాంగాన్ని ఆదుకోవాలన్నారు. కార్యక్రమంలో సీపీఐ నాయకులు, సనప రామకృష్ణ, దుర్గాప్రసాద్, మన్నీల, వెంకటరాముడు, నగేష్, వేణు, రసూల్, రఫీ, ఆంజనేయులు, రాజు తదితరులు పాల్గొన్నారు.

అద్దె @ రూ.1.40 లక్షలు

- అద్దె వాహనాల బాట పట్టిన అధికారులు
- అదనపు కమిషనర్, ఇద్దరు ఈఈలు, డీఈలకు వాహనాల కేటాయింపు
- ఒక్కో వాహనానికి నెలకు రూ.35 వేల అద్దె చెల్లింపు
- నిబంధనలకు విరుద్ధంగా సీ బిల్లులు
- మూలకుపడేసిన ఆరు ఎలక్ట్రిక్ వాహనాలు



నగరపాలక సంస్థలో మూలకుపడ్డ ఎలక్ట్రిక్ వాహనాలు

అనంతపురం కార్పొరేషన్: నగర ప్రజలు పన్నుల రూపేణ చెల్లించిన డబ్బును అధికారులు అభివృద్ధి పనులకు కేటాయించడం లేదు. అద్దె వాహనాల పేరుతో ప్రజాధనాన్ని ఇష్టారాజ్యంగా ఖర్చు చేస్తున్నారు. మరమ్మతుకు గురైన వాహనాలను రిపేరీకి ఇచ్చి ఇంత వరకు వాటిని పట్టించుకోకపోవడం.. అద్దె వాహనాలు తీసుకున్నా కనీసం వాటినైనా టెండర్లతో పిలవకుండా అధికార దుర్వినియోగం చేస్తున్నారన్న విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ప్రతి నెలా రూ.1.40 లక్షల వరకు అద్దె వాహనాలకు కేటాయిస్తుండటం సర్వత్రా విమర్శలకు దారి తీస్తోంది.

మళ్లీ సీ బిల్లులు..

2014-19 టీడీపీ ప్రభుత్వంలో సీ బిల్లులను ఇష్టారాజ్యంగా చేపట్టి రూ.లక్షల్లో కొల్లగొట్టిన సందర్భాలు ఉన్నాయి. ఇప్పుడు మళ్లీ సీ బిల్లులు పెట్టేందుకు ఇంజినీర్లు సిద్ధమయ్యారు. గత కొన్ని నెలలుగా అద్దె వాహనాలకు చెల్లించే మొత్తాన్ని సీ బిల్లు ద్వారా ఇస్తుండటం పెద్ద చర్చనీయాంశమైంది. నగరపాలక సంస్థలో అదనపు కమిషనర్ రామలింగేశ్వర్, ఈఈలు షాకీర్, రాధాకృష్ణ, డీఈ నరసింహ (వాటర్ సప్లై)కు అద్దె వాహనాలను వినియోగిస్తున్నారు. ఈ వాహనాలకు బిల్లుల చెల్లింపులకు సంబంధించి ప్రతి నెలా ఒక్కో వాహనానికి రూ.35,000 వరకు చెల్లిస్తుండటం గమనార్హం. వాస్తవంగా వాహనాల సమస్య ఉంటే టెండర్ల ద్వారా వాహనాలను కేటాయించాల్సి ఉంది. అటువంటి పరిస్థితి లేకుండా అధికారులే వాహనాలను తెచ్చుకుని సీ బిల్లు చేయించుకుంటున్నారు.

మరమ్మతులు చేయించరా?

నగరపాలక సంస్థకు సంబంధించి మొత్తం 9 ఎలక్ట్రిక్ వాహనాలు ఉన్నాయి. వాటిలో నగరపాలక సంస్థ ఆవరణలో నాలుగు వాహనాలు మూలకుపడ్డాయి. అదేవిధంగా గతంలో వరదలు వచ్చిన సమయంలో డీఈ శేఖర్ రజక్‌నగర్‌కు వాహనంలో వెళ్లారు. ఆ సమయంలో డ్రైవర్ వద్దని చెబుతున్నా.. ఏమి కాదని చెప్పి వంకలోకి వెళ్లారు. దీంతో కారు మునిగిపోయి పాడైపోయింది. వాస్తవంగా నిర్లక్ష్యంగా వ్యవహరించి కారు పాడయ్యేలా చేసిన అధికారుల నుంచి సొమ్ము రికవరీ చేయాల్సి ఉంది. కానీ అటువంటి పరిస్థితి లేదు. ఇప్పుడు ఆ వాహనం షెడ్డులో ఉంది. ఇంకా మరో రెండు వాహనాలు మరమ్మతులకు గురికాగా.. వాటికి బిల్లులు చెల్లించకుండా సర్వీస్ షెడ్డులోనే ఉంచేశారు. ఆ వాహనాలు వస్తే ఇంధనం సమస్య లేకుండా అధికారులు పర్యటించేందుకు వీలుగా ఉంటుంది.

వాహనాల నిర్వహణకు ముందుకురావడం లేదు



అద్దె వాహనాలకు సంబంధించి వాటి నిర్వహణకు ఎవరూ ముందుకురావడం లేదు. తప్పని పరిస్థితుల్లో అద్దె వాహనాలను తీసుకోవాల్సి వస్తోంది. సీ బిల్లులో పైసా కూడా ఎక్కువ ఇవ్వకుండా నిర్దేశించిన మొత్తాన్ని ఇస్తున్నాం.

– నాగరాజు, కమిషనర్, నగరపాలక సంస్థ

నగరాభివృద్ధిలో కార్మికుల పాత్ర కీలకం



కార్మికులకు దుస్తులు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే దగ్గుపాటి వెంకటేశ్వర ప్రసాద్, మేయర్ వసీం

అనంతపురం కార్పొరేషన్: నగరపాలక సంస్థలో కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని ఎమ్మెల్యే దగ్గుపాటి వెంకటేశ్వర ప్రసాద్, మేయర్ వసీం పేర్కొన్నారు. శనివారం నగరపాలక సంస్థలో రెగ్యులర్ కార్మికులకు దుస్తులు పంపిణీ చేశారు. ఎమ్మెల్యే దగ్గుపాటి వెంకటేశ్వర ప్రసాద్ మాట్లాడుతూ.. నగరాభివృద్ధిలో కార్మికుల పాత్ర ఎంతో కీలకమన్నారు. ధర్నాలు, నిరసన చేయకుండా పనులు చేయాలని సూచించారు. కార్మికుల సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరించేందుకు కృషి చేస్తామన్నారు. అందుకు కార్మిక సంఘం నాయకులు నాగరాజు కార్మికులకు రావాల్సిన పనిముట్లు, చెప్పులు, కొబ్బరినూనె, తదితర ప్రయోజనాలను అందిస్తే నిరసనలు ఎందుకు చేస్తామన్నారు. మేయర్ వసీం మాట్లాడుతూ.. గత మూడేళ్లుగా కార్మికులకు దుస్తులు పంపిణీ చేస్తున్నట్లు తెలిపారు. 2021-22లో రూ.11.44 లక్షలు, 2022-23లో రూ.9.7 లక్షలు, 2023-24లో రూ.10 లక్షల కార్మికుల దుస్తులు కోసం వెచ్చించడం జరిగిందన్నారు. దుస్తుల నాణ్యతలో కార్మికులను భాగస్వాములను చేయడం జరిగిందన్నారు. కార్మికుల సంక్షేమం, అభివృద్ధికి తమ పాలకవర్గం కృషి చేస్తుందన్నారు. అందులో భాగంగానే గతంలో పారిశుధ్య కార్మికుల ఆరోగ్య రక్షణ కోసం మెడికల్ క్యాంపులను నిర్వహించిన విషయాన్ని గుర్తు చేశారు. కార్యక్రమంలో డిప్యూటీ మేయర్లు కోగటం విజయభాస్కర్ రెడ్డి, వాసంతి సాహిత్య, కమిషనర్ నాగరాజు, అదనపు కమిషనర్ రామలింగేశ్వర్, ఎంహెచ్‌ఓ డాక్టర్ విష్ణుమూర్తి, కార్పొరేటర్లు లీలావతి, లావణ్య, కమల్‌భూషణ్, తదితరులు పాల్గొన్నారు.

స్వీయరక్షణ నైపుణ్యాలపై బాలికలకు శిక్షణ



మాట్లాడుతున్న అసిస్టెంట్ కలెక్టర్ వినూత్న

అనంతపురం అర్బన్: బాలికలకు స్వీయరక్షణ నైపుణ్యాలు అందించేందుకు ప్రత్యేకంగా శిక్షణ కార్యక్రమాలు నిర్వహించాలని అసిస్టెంట్ కలెక్టర్ బొల్లిపల్లి వినూత్న సంబంధిత అధికారులను ఆదేశించారు. ప్రతి పాఠశాల, కళాశాలలోనూ బాలికలతో సేఫ్టీ క్లబ్ ఏర్పాటు చేసి వారి సమస్యలను వారే పరిష్కరించుకునేలా శిక్షణ ఇవ్వాలని పేర్కొన్నారు. మహిళా శిశు సంక్షేమశాఖ, ఆర్డీటీ సంయుక్తగా శనివారం కలెక్టరేట్‌లోని రెవెన్యూ భవన్‌లో 'స్ట్రెంతనింగ్ సెల్వ్స్' కార్యక్రమంపై జిల్లాస్థాయి ప్రణాళిక సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. స్ట్రెంతనింగ్ సెల్ఫ్ కార్యక్రమం ద్వారా జిల్లాలో కనీసం 50 వేల మంది కౌమార దశ బాలికలకు వర్క్‌షాప్ ద్వారా స్వీయ రక్షణ నైపుణ్యాలు నేర్పించాలన్నారు. ఆత్మవిశ్వాసం పెంపొందించుకుని భవిష్యత్తులో మంచిస్థాయికి ఎదేందుకు దోహదపడే అంశాలు నేర్పించాలన్నారు. బాలికలకు నిర్వహించే వర్క్‌షాప్‌లో సేఫ్టీ అవేర్నెస్, బేసిక్ సెల్ఫ్ డిఫెన్స్ స్కిల్స్, సైకలాజికల్ ఎంపవర్మెంట్, ఇంటరాక్టివ్ ఫోరమ్స్ అనే అంశాలపై శిక్షణ ఇవ్వాలన్నారు.

13న వర్క్‌షాప్‌లు

నిర్దేశించిన అంశాలపై ఈనెల 13న జిల్లావ్యాప్తంగా 100 కళాశాలలు, పాఠశాలల్లో వర్క్‌షాపులు నిర్వహించాలన్నారు. మహిళ శిశు సంక్షేమ శాఖ, ఆర్‌డీటీ, జిల్లా కరాటే అసోసియేషన్, ఆర్‌డీటీ కల్చరల్ టీమ్, తరిమెల రాజు కల్చరల్ టీమ్‌లు ఎంపిక చేసిన పాఠశాలల్లో వర్క్‌షాప్ చేపట్టాలన్నారు. కార్యక్రమంలో మహిళ శిశుసంక్షేమ శాఖ పీడీ శ్రీదేవి, ఆర్డీటీ సెంట్రల్ ప్రొక్యూర్మెంట్ డైరెక్టర్ పుష్పలత, కళ్యాణదుర్గం రీజనల్ డైరెక్టర్ సుబ్బారావు, డీసీపీఓ మంజూనాథ్, సీడీపీఓలు పాల్గొన్నారు.

ఐక్యతతోనే ముస్లింల అభివృద్ధి



సమావేశానికి హాజరైన ముస్లింలు



మాట్లాడుతున్న మౌలానా సబీల్

అనంతపురం కల్చరల్: ఐక్యతతోనే ముస్లింల అభివృద్ధి సాధ్యమని మౌలానా సబీల్ అన్నారు. స్థానిక జూనియర్ కళాశాల ప్రాంగణంలో శనివారం రాత్రి ఆల్ ఇండియా జమాతుల్ ఉలేమాయే హింద్ ఆధ్వర్యంలో సమావేశం జరిగింది. ఈ సందర్భంగా మౌలానా సబీల్ మాట్లాడుతూ.. కేంద్ర ప్రభుత్వం కావాలనే మైనార్టీలపై కక్ష సాధింపు చర్యలకు పాల్పడుతోందన్నారు. ట్రిపుల్ తలాక్, హిజాబ్, వక్ఫ్ చట్టాలతో ముస్లింల మనోభావాలను దెబ్బతీస్తున్నారని తెలిపారు. ఎన్నికల సమయంలో అన్ని రాజకీయ పార్టీలు ముస్లింలకు అండగా ఉంటామని హామీలిచ్చినట్లు పేర్కొన్నారు. అధికారంలోకి వచ్చాక బీజేపీకి వంత పాడుతూ ముస్లింలను వంచిస్తున్నారని ఆవేదన చెందారు. వక్ఫ్ ఆస్తుల పరిరక్షణకు అందరం ఐక్యతతో ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. ఈనెల 15న కడపలో జరిగే బహిరంగ సభకు తరలిరావాలని కోరారు. కార్యక్రమంలో మేయర్ వసీం, ఉర్దూ అకాడమీ మాజీ చైర్మన్ నదీం మహమ్మద్, మాజీ మార్కెట్ యార్డు చైర్మన్ ఫయాజ్‌బాషా, వైఎస్సార్‌సీపీ జిల్లా మైనార్టీ విభాగం అధ్యక్షుడు సైపుల్లా బేగ్, సీపీఐ నాయకులు జాఫర్, కాంగ్రెస్ పార్టీ నాయకులు దాదాగాంధీ, ఇమామ్, గౌస్‌పీర్, మేవా నాయకులు షేక్షా తదితరులు పాల్గొన్నారు.

సంక్షిప్త సమాచారం

వడ్డుపల్లి మాజీ సర్పంచ్ మృతి

ఆత్మకూరు: మండలంలోని వడ్డుపల్లి గ్రామానికి చెందిన మాజీ సర్పంచ్ వడ్డే వెంకటేశులు శనివారం బ్రెయిన్ స్ట్రోక్‌తో మరణించారు. ఈయన 2007 సంవత్సరంలో సర్పంచ్‌గా గెలుపొందారు. గ్రామాభివృద్ధికి విశేషంగా కృషి చేశారు. అందరితో కలసిమెలసి ఉండేవారు. వెంకటేశులు మృతి చెందడంతో గ్రామస్తులు దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు.

ల్యాబ్ పరికరాల వితరణ

అనంతపురం: ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల, అనంతపురంకు చెందిన 1994-97 బ్యాచ్ ఎలక్ట్రికల్ పూర్వ విద్యార్థులు రూ.94 వేలు విలువ చేసే ల్యాబ్ పరికరాలు, 5 యూపీఎస్‌లను కళాశాలకు ఉచితంగా అందజేశారు. ఈ సందర్భంగా అప్పటి లెక్చరర్ ఫణి ప్రకాష్ రెడ్డి మాట్లాడుతూ.. పూర్వ విద్యార్థుల చేయూతతోనే ఏ కళాశాల అయినా అభివృద్ధి చెందుతుందన్నారు. ఈ సందర్భంగా పూర్వ విద్యార్థులకు ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపాల్ జయచంద్రా రెడ్డి అభినందనలు తెలిపారు. కార్యక్రమంలో ఎలక్ట్రికల్ విభాగాధిపతి డాక్టర్ ఎం.రామకృష్ణా రెడ్డి, లెక్చరర్ లావణ్య పాల్గొన్నారు.

కమనీయం.. కల్యాణం



సుబ్రహ్మణ్యేశ్వరుడికి కల్యాణం జరిపిస్తున్న దృశ్యం

ఆత్మకూరు: పంపనూరులోని సర్పరూప సుబ్రహ్మణ్యేశ్వర స్వామి ఆలయంలో శనివారం భక్తిశ్రద్ధలతో కల్యాణం నిర్వహించారు. తొలుత స్వామిని ప్రత్యేకంగా అలంకరించి, పంచామృతాభిషేకం చేపట్టారు. ఆలయ ప్రాంగణంలో శ్రీవల్లి, దేవసేన, సుబ్రహ్మణ్యేశ్వర స్వామి ఉత్సవ విగ్రహాలను పట్టు వస్త్రాలు, బంగారు ఆభరణాలతో అలంకరించారు. పసుపు, కుంకుమ కలిపిన అక్షింతలతో మేళతాళాలు, మంగళవాయిద్యాల నడుమ అంగరంగ వైభవంగా కల్యాణోత్సవం నిర్వహించారు. అనంతరం భక్తులకు ప్రసాదం అందజేశారు. ఆలయంలో పెద్ద ఎత్తున అన్నదాన కార్యక్రమాలను నిర్వహించారు.

కష్టపడి చదివితే ఉజ్వల భవిష్యత్తు

రాప్తాడు/ఆత్మకూరు: కష్టపడి చదివితే ఉజ్వల భవిష్యత్తు ఉంటుందని ఎమ్మెల్యే పరిటాల సునీత పేర్కొన్నారు. శనివారం ఆత్మకూరు, రాప్తాడులోని పాఠశాలల్లో 'మెగా పేరెంట్స్ టీచర్స్ సమావేశాలు' నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. రాప్తాడు పీహెచ్‌సీని మోడల్ ఆసుపత్రిగా మారుస్తామని తెలిపారు. జాతీయ ఫ్లోరోసిస్ నివారణ, నియంత్రణ కార్యక్రమంలో భాగంగా చేతి కర్రలు, వాకర్స్, మెడ బెల్టులు పంపిణీ చేశారు. ఆత్మకూరు కేజీబీవీలో విద్యార్థులు నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి.

సైనికుల కుటుంబాలకు అండగా నిలవాలి

అనంతపురం ఎడ్యుకేషన్: దేశ రక్షణలో యువత ఉత్సాహంగా పాలుపంచుకోవాలని ఆర్ట్స్ కళాశాల ప్రిన్సిపాల్ పద్మశ్రీ పిలుపునిచ్చారు. సాయుధ దళాల పతాక దినోత్సవం సందర్భంగా శనివారం జిల్లా సైనిక సంక్షేమ సంఘం, ఆర్ట్స్ కళాశాల ఎన్‌సీసీ, ఎన్ఎస్ఎస్ ఆధ్వర్యంలో నిర్వహించిన ర్యాలీని ప్రారంభించి ప్రసంగించారు. దేశసేవలో ఎంతోమంది సైనికులు ప్రాణాలు అర్పించారని గుర్తు చేశారు. అలాంటి వారి కోసం మనమంతా కొంత ఆర్థిక సహకారాన్ని వారి కుటుంబ సభ్యులకు అందించాల్సిన అవసరం ఉందని తెలియజేశారు. పతాక దినోత్సవ ర్యాలీ ఆర్ట్స్ కళాశాల నుంచి టవర్ క్లాక్ వరకూ సాగింది. జిల్లా సైనిక అధికారులు, కళాశాల ఎన్ఎస్ఎస్ అధికారులు విష్ణుప్రియ, సుధాకర్ జయలక్ష్మీ, బాలాజీ నాయక్, ఎన్‌సీసీ అధికారి రామాంజనేయులు పాల్గొన్నారు.

చిత్రావతి హాస్టల్ తనిఖీ

అనంతపురం: శ్రీకృష్ణదేవరాయ విశ్వవిద్యాలయం చిత్రావతి హాస్టల్‌ను రిజిస్ట్రార్ డాక్టర్ రమేష్ బాబు శనివారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. మెనూ పరిశీలించి, భోజన నాణ్యత ఎలా ఉంటోందని విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. ఉద్యోగుల పనితీరు, సమయపాలనపై ఆరా తీశారు. రిజిస్ట్రార్ వెంట డిప్యూటీ వార్డెన్ డాక్టర్ సీహెచ్ కృష్ణుడు ఉన్నారు.

10న 'సాధన' పుస్తక పరిచయ సభ

అనంతపురం కల్చరల్: వివక్ష ఎదుర్కొంటున్న రాయలసీమకు కథలతో ప్రత్యేక గుర్తింపు తెచ్చిన శాంతినారాయణ రచించిన 'సాధన' పుస్తక పరిచయ సభ ఈనెల 10న కర్నూలులో జరగనుంది. సిల్వర్ జూబ్లీ ప్రభుత్వ కళాశాలలో జరగనున్న కార్యక్రమానికి ప్రముఖ సాహితీవేత్తలు విచ్చేస్తారని నిర్వాహకులు తెలిపారు.

వైభవంగా అయ్యప్ప గ్రామోత్సవం



భజన చేస్తున్న మాలధారులు

అనంతపురం కల్చరల్: స్వామియే శరణం అయ్యప్ప.. అంటూ మాలధారుల శరణు ఘోషతో అనంత పురవీధులు మార్మోగాయి. చెరువుకట్టపై వెలసిన అయ్యప్ప స్వామి ఆలయంలో జరుగుతున్న ఉత్సవ పూజల్లో భాగంగా శనివారం భారీ ఎత్తున గ్రామోత్సవం నిర్వహించారు. వందల సంఖ్యలో అయ్యప్ప మాలధారులు భజనలతో హోరెత్తించారు. ఆలయం వద్ద నుంచి పాతూరు, సప్తగిరి సర్కిల్, టవర్‌క్లాక్, శ్రీకంఠం సర్కిల్ మీదుగా మళ్లీ స్వస్థానం చేరుకున్న గ్రామోత్సవాన్ని తిలకించేందుకు భక్తులు పెద్ద ఎత్తున తరలివచ్చారు. విశేష అలంకారంలో స్వామివారి రథానికి ఇరువైపుల అధిక సంఖ్యలో మహిళలు దీపాలు పట్టుకుని స్వాగతం పలికారు. అలాగే కేరళ నుంచి విచ్చేసిన ప్రత్యేక వాయిద్య బృందాలతో పాటూ స్థానిక కళాకారులు వేషధారణలతో సందడి చేశారు. ఊరేగింపులో ఆలయ కమిటీ అధ్యక్షుడు మణికంఠ గౌతమ్ ఆలయాల ప్రతినిధులు పాల్గొన్నారు.

రాచానపల్లి పంచాయతీలో..

రాప్తాడురూరల్: అనంతపురం రూరల్ మండలం రాచానపల్లి పంచాయతీలో శనివారం సాయంత్రం అయ్యప్పస్వామి గ్రామోత్సవం ఘనంగా జరిగింది. ప్రత్యేకంగా అలంకరించిన వాహనంలో అయ్యప్పస్వామి విగ్రహాన్ని ఊరేగించారు. మహిళలు హారతులు పట్టారు. అనంతరం అయ్యప్ప ఆలయం వద్ద సర్పంచ్ బండా అంజియాదవ్ ఆధ్వర్యంలో అన్నదానం ఏర్పాటు చేశారు.

లింగ నిర్ధారణ చేస్తే చర్యలు



మాట్లాడుతున్న ఆర్డీఓ కేశవనాయుడు

అనంతపురం రూరల్: లింగ నిర్ధారణ పరీక్షలు చేసే స్కానింగ్ సెంటర్ల నిర్వాహకులపై కఠిన చర్యలు తప్పవని ఆర్డీఓ కేశవనాయుడు హెచ్చరించారు. శనివారం ఆర్డీఓ కార్యాలయంలో గర్భస్థ, పిండ లింగ నిర్ధారణ చట్టంపై డివిజనల్ స్థాయి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆర్డీఓ కేమాట్లాడుతూ.. గర్భస్థ పిండ, లింగ నిర్ధారణ చట్టాన్ని పటిష్టంగా అమలు చేయాలన్నారు. స్కానింగ్ సెంటర్లలో సెక్స్ డిటెక్షన్ జరగకుండా నిఘా ఉంచాలన్నారు. చట్టంపై అవగాహన కల్పించడంతో పాటు ఆడపిల్లల ప్రాముఖ్యతను ప్రజలకు వివరించాలన్నారు. కార్యక్రమంలో కమిటీ కన్వీనర్ డాక్టర్ సుజాత, డాక్టర్ రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.

క్రీడలతోనే క్రమశిక్షణ



బహుమతులు అందజేస్తున్న దృశ్యం

అనంతపురం: క్రీడలతో జీవితంలో క్రమశిక్షణ, అంకితభావం, పట్టుదల అలవడతాయని ఎస్కేయూ ఇన్‌చార్జ్ వీసీ ప్రొఫెసర్ బి.అనిత అన్నారు. స్థానిక ఆర్ట్స్ కళాశాలలో శనివారం అథ్లెటిక్స్ చాంపియన్‌షిప్ పోటీలను ప్రారంభించారు. ఐదు కిలోమీటర్ల పరుగు పందెంలో ఆర్ట్స్ కళాశాలకు చెందిన రాజ్యలక్ష్మి, హర్షిత, ఎస్ఎస్‌బీఎన్ కళాశాలకు చెందిన బి.పూజిత విజేతలుగా నిలిచారు. కార్యక్రమంలో ఆర్ట్స్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ పి.పద్మజ, ఎస్కేయూ స్పోర్ట్స్ బోర్డు సెక్రెటరీ డాక్టర్ బి.జెస్సీ తదితరులు పాల్గొన్నారు.

ఎంబీఏ విభాగంలో ఇద్దరికి డాక్టరేట్లు

అనంతపురం: శ్రీకృష్ణదేవరాయ విశ్వవిద్యాలయంలోని ఎంబీఏ విభాగంలో ఇద్దరికి డాక్టరేట్లు ప్రదానం చేశారు. ఎస్కేయూ ఇన్‌చార్జ్ వీసీ ప్రొఫెసర్ బి.అనిత పర్యవేక్షణలో పరిశోధన చేసిన బీఆర్ స్పందనకు డాక్టరేట్ అందజేశారు. ఈమె ఇంపాక్ట్ ఎమోషనల్ ఇంటిలిజెన్స్ ఆన్ పెర్ఫార్మెన్స్ ఆఫ్ బ్యాంక్ ఎంప్లాయీస్ (విత్ రెఫరెన్స్ టు ఎస్‌బీఐ అండ్ కెనరా బ్యాంక్ ఇన్ రాయలసీమ రీజియన్) అనే అంశంపై పరిశోధన చేశారు. ఈ అంశంపై పలు జాతీయ, అంతర్జాతీయ జర్నల్స్ ప్రచురించారు. ఎంబీఏ విభాగం రిటైర్డ్ ప్రొఫెసర్ కే.వేణుగోపాల్ రావు పర్యవేక్షణలో పరిశోధన చేసిన ఎం.రాజ కుమార్‌కు డాక్టరేట్ ప్రదానం చేశారు. ఈయన 'ఇంపాక్ట్ ఆఫ్ కార్పొరేట్ యాక్షన్స్ ఆన్ ఇన్వెస్టిమెంట్ డెసిషన్స్ ఆఫ్ ది ఇన్వెస్టర్స్ విత్ రెఫరెన్స్ టు రాయలసీమ రీజియన్ ఆఫ్ ఆంధ్రప్రదేశ్' అంశంపై పరిశోధన చేశారు.

'వక్ఫ్ చట్టాన్ని నిర్వీర్యం చేస్తున్నారు'

- వక్ఫ్‌బోర్డు జిల్లా చైర్మన్ కాగజ్‌ఘర్ రిజ్వాన్



అనంతపురం కార్పొరేషన్: కూటమి ప్రభుత్వం వక్ఫ్ చట్టాన్ని నిర్వీర్యం చేస్తూ ముస్లిం మైనార్టీలకు తీరని అన్యాయం చేస్తోందని వక్ఫ్ బోర్డు జిల్లా చైర్మన్ కాగజ్‌ఘర్ రిజ్వాన్ ధ్వజమెత్తారు. శనివారం వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. కేంద్రం ప్రవేశపెట్టబోతున్న వక్ఫ్ అమెండ్మెంట్ బిల్లుకు వ్యతిరేకంగా అసెంబ్లీలో తీర్మానం చేసి మైనార్టీల మనోభావాలను కాపాడాలన్నారు. రాష్ట్రంలో వక్ఫ్‌బోర్డు ఏర్పాటు కూడా ఒక పద్ధతి లేకుండా చేశారని ఆరోపించారు. గతంలో టీడీపీ అధికారంలో ఉన్న సమయంలో జలీల్‌ఖాన్ ఉండేవారని.. వైఎస్సార్‌సీపీ అధికారంలోకి వచ్చాక ఆయన్ను కొనసాగించి చైర్మన్‌గా ఖాదర్ బాషాను చేయడం జరిగిందన్నారు. కూటమి ప్రభుత్వంలో పాత వారిని తొలగించి టీడీపీ నాయకులకు బోర్డులో చోటు ఇవ్వడం అన్యాయమన్నారు. ఈ కొత్త బోర్డులో అడ్వకేట్ కేటగిరీ నుంచి ప్రాతినిధ్యం లేదన్నారు. అదేవిధంగా ప్రభుత్వ అఫిషియల్ కేటగిరీ నుంచి ప్రాతినిధ్యం లేదన్నారు. ఉమెన్స్ కేటగిరీ నుంచి సభ్యులు లేకపోవడం విచారకరమన్నారు. వక్ఫ్ బోర్డు ఆస్తులను పరిరక్షించాలని డిమాండ్ చేశారు.



వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో రాజీవ్ కాలనీ వాసుల సౌకర్యార్థం నిర్మించిన జగనన్న వారధి



జగనన్న వారధి పేరు కనపడకుండా ఫ్లెక్సీలు ఏర్పాటు చేసిన టీడీపీ నాయకులు

ఇదెక్కడి పైత్యం?!

అనంతపురం నగరంలో టీడీపీ నాయకులు మరీ దిగజారి ప్రవర్తిస్తున్నారు. గత ప్రభుత్వం చేపట్టిన అభివృద్ధి పనుల ఆనవాళ్లు ప్రజలకు కన్పించకుండా కుట్రలు చేస్తున్నారు. ఇందులో భాగంగా శిలాఫలకాలను సైతం కప్పి ఉంచుతున్నారు. గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో రాజీవ్ కాలనీ వాసుల సౌకర్యార్థం బ్రిడ్జి నిర్మించారు. 'జగనన్న వారధి' అని పేరుపెట్టి ప్రవేశ ద్వారంలో నేమ్‌బోర్డు ఏర్పాటు చేశారు. ప్రస్తుతం ఇది కన్పించకుండా టీడీపీ, బీజేపీ నాయకులు ఫ్లెక్సీలను ఏర్పాటు చేశారు. టీడీపీ నాయకుల తీరును ప్రజలు తప్పుబడుతున్నారు.

– సాక్షి ఫొటోగ్రాఫర్, అనంతపురం: